ప్రభుత్వ అధ్యాపకుడిపై సస్పెన్షన్ వేటు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 8: ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి చర్యలకు ఉపక్రమించారు. సదాశివపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ గౌడ్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించి బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్టు పండరి నాయక్, ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు విచారణ జరిపారు. సోషల్ మీడియాలో, వార్తా పత్రికల ద్వారా విచారణ చేయగా నిజమని తేలిందన్నారు. సంబంధిత అధ్యాపకుడిపై సీసీఏ రూల్స్ ప్రకారం సస్పెన్షన్ వేటు వేసినట్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులందరూ ఎన్నికల నియమాలకు లోబడి పని చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

తండ్రి మందలించాడని..

పురుగు మందు తాగి కొడుకు మృతి

గుమ్మడిదల, ఏప్రిల్ 8: ఏ పని చేయకుండా తిరుగుతున్నాడని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కొడుకు పురుగు మందు తాగి మృతి చెందాడు. గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన పిట్ల బాలేశ్ చిన్న కుమారుడు నవీన్(24) కొద్ది రోజులుగా ఏ పని చేయడం లేదు. ఈ నెల 4న ఖర్చుల కోసం డబ్బులు ఇవ్వాలని తండ్రిని కోరగా తన వద్ద డబ్బులు లేవు. కష్టంజేసి సంపాదించుకో అని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగుతూ వీడియో అక్కకు వీడియోకాల్ చేశాడు. ఎంతచెప్పినా వినకుండా తాగాడు. వెంటనే కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని వెంటనే మల్లారెడ్డి దవాఖానకు అంబులెన్స్‌లో తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

15లోగా ఫీజు చెల్లించాలి

అందోల్, ఏప్రిల్ 8: ఓయూ పరిధిలో చదివి డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు అధికారులు వన్‌టైం చాయిస్ కింద మళ్లీ అవకాశం కల్పించారని నెహ్రూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల్లో 2000-2019 మధ్య ఫెయిల్ అయిన వారు ఈ నెల 15వరకు, 20 నుంచి 22 వరకు అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చన్నారు. గతంలో రూ.10 వేలుగా ఉన్న ఫీజును ఇప్పుడు రూ.2వేలకు తగ్గించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98499 63988 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇంటి పన్ను చెల్లింపులో 5 శాతం రాయితీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 8: ఇంటి పన్ను చెల్లింపులో ప్రభుత్వం పన్నుదారులకు 5 శాతం మినహాయింపు ఇస్తున్నదని తెల్లాపూర్ మున్సిపాల్ కమిషనర్ సంగారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గృహ, వ్యాపార, వాణిజ్య యజమానులు ఏప్రిల్ 30వ తేదీలోగా పన్నులను చెల్లిస్తే చెల్లించాల్సిన పన్నులో 5శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంబంధిత బిల్ కలెక్టర్లకు గానీ, కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు.

సరైన పత్రాలు లేకుంటే వాహనాలు సీజ్

బొల్లారం, ఏప్రిల్ 8: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు బొల్లారం పారిశ్రామికవాడలో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో రెండు టీంలు తనిఖీలు చేస్తున్నాయి. మూడు రోజులుగా హనుమాన్ టెంపుల్, మాధవాని కుంట సమీపంలోని సర్వీస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆటో యూనియన్ డ్రైవర్లు ఆనంద్ కృష్ణారెడ్డి చొరవతో గతంలో ఇన్సూరెన్స్ చేయించుకున్నామని సీఐకి విన్నవించారు. తనిఖీల్లో ఎస్సైలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 8: గ్రూప్-1, 2, 3, 4 సర్వీసులకు 3 నెలల ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేశ్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ విద్యార్థులు నేరుగా ఎస్సీ స్టడీ సెంటర్‌కు వచ్చి ప్రవేశం పొందాలని కోరారు. సంగారెడ్డిలోని సమీకృత బాలుర వసతి గృహంలో శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు హాస్టల్ వసతితో పాటు స్టడీ మెటీరియల్ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9440478004, 39341575 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆదరించండి.. సేవకుడిలా పని చేస్తా

- గెలిచిన నెల రోజుల్లో రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్ట్
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 ఏండ్లు అధికారిగా సుదీర్ఘ అనుభవం
- గెలిపిస్తే నిత్యం ప్రజా జీవితంలోనే ఉంటా..
- బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- సదాశివపేటలో బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం

మాట్లాడుతున్న మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

సదాశివపేట, ఏప్రిల్ 8: లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. గెలిచిన నెల రోజుల్లోనే సొంత డబ్బులు రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు అధ్యక్షతన మండలస్థాయి లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాతో తనకు 11 ఏండ్లు అధికారిగా సుదీర్ఘ అనుభవం ఉన్నదని గుర్తుచేశారు. ఏడున్నర సంవత్సరాలపాటు జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌గా పని చేసి ప్రజలకు సేవలందించానన్నారు. ఇదే గడ్డపై ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం సంతోషంగా ఉన్నదన్నారు. మెదక్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ గెలుస్తుందని, కార్యకర్తలందరూ సమష్టిగా పనిచేస్తే బీజేపీ, కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, పేదలకు ఉచితంగా పెండ్లిళ్లు చేసుకునేందుకు ప్రతి నియోజకవర్గంలో ఫంక్షన్ హాల్ నిర్మిస్తానన్నారు. వేలాది పేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పేద విద్యార్థులకు కోచింగ్, యువతకు వృత్తి నైపుణ్య కోర్సులు అందిస్తానన్నారు. యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. నెల రోజులు తన వెంట నడిస్తే జీవితకాలం మీ వెంటే ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు సమస్యలు, రైతుల సాగునీటి కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. ఎంపీగా గెలిస్తే ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, డీసీసీబీ ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోడూరి రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, ఆత్మకూర్ నగేశ్, సత్తయ్యయాదవ్, ఎంపీటీసీలు అల్లం లలిత, సత్యనారాయణ, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తల కష్టం మరువలేనిదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపుకోసం పని చేసిన విధంగానే రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని కార్యకర్తలను కోరారు. మెదక్ ఎంపీగా వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే సంగారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు భూటకమని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సీఎం స్థాయిలో మాట్లాడడం లేదని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మైనార్టీ నాయకులు

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

కంది, ఏప్రిల్ 8: రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం కంది మండలం బేగంపేట్ గ్రామంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అండగా నిలుస్తుందన్నారు. అంతకుముందు ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేగంపేట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాయిగౌడ్ అధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్ మైనార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అంజద్, రహమత్ అలీ, చాంద్‌పాషా, షకీల్, గౌస్మియా, చోటేమియా, ఇస్మాయిల్, కాసీం, ఇబ్రహీం, ఖాజా, ముజీబ్, జాఫర్, జాంగీర్, అమీర్, మహ్మద్, ఫయూం, అజీమ్, మక్బుల్, హర్షద్, దస్తగిరి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, నరహరిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేకులపై చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అందోల్, ఏప్రిల్ 8: గడిచిన ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన అందోల్‌కు చెందిన స్టేట్ మార్కెఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆయనతో పనిచేసిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని అందోల్ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వెంటే ఉంటూ పార్టీ అంతర్గత విషయాలను కాంగ్రెస్ అభ్యర్థికి చేరవేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమికి పనిచేశారన్నారు. ఎన్నికల తర్వాత నేరుగా కాంగ్రెస్ నాయకులతో తిరుగుతున్నారని, అలాంటి వారిని ఉపేక్షించవద్దని కోరారు. పార్టీ ఓటమికి కారణమైన వారిని సస్పెండ్ చేయడంతోపాటు పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నంగౌడ్, సుధాకర్‌గౌడ్, వినోద్‌రెడ్డి, బుచ్చయ్య, పోచయ్య, బలరామ్, శ్రీనివాస్, శేకర్, అశోక్, చెన్నయ్య, బాగయ్య పాల్గొన్నారు.

10 నుంచి బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 8: పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తరపున ప్రచారం ప్రారంభిస్తున్నామని సోమవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల వ్యూహం రచించినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ డివిజన్లు, మండలాలు, గ్రామాల్లో నిర్వహించాల్సిన ప్రచారంపై చర్చించామని, నెల రోజుల పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు గడపగడపకూ వెళ్తారని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10న గణేశ్ దేవస్థానంలో పూజలు నిర్వహించి ప్రచార రథాలను ప్రారంభిస్తామని తెలిపారు. 13న పటాన్‌చెరు జీఎమ్మార్ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందని, అనంతరం మండల, మున్సిపల్, డివిజన్లలో సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రచారం ఉంటుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేతృత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ ఇస్తామన్నారు.

వడదెబ్బ బారిన పడకుండా చర్యలు

వైద్య ఆరోగ్య శాఖ జిల్లా వైద్యాధికారిని గాయత్రీదేవి

మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి

న్యాల్‌కల్, ఏప్రిల్ 8: ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుండడంతో వడదెబ్బ వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు, సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. వచ్చే రెండు నెలలపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని, ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారులు అమీత్‌రావు, గణపతిరావు, వైద్య సిబ్బంది పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

మనూరు, ఏప్రిల్ 8: పిల్లలను చెరువులు, కుంటల్లోకి ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సీఐ శ్రీనివాస్ రెడ్డి కోరారు. మండల పరిధిలోని కమలాపూర్ చెరువు వద్ద మనూరు ఎస్సై మూడ్ అంబయ్యతో కలిసి హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కావడంతో పిల్లలు సరదాగా ఈతకు వెళ్లేందుకు చూస్తుంటారని, తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు.

చెరువులు, కుంటలకు వెళ్లనీయొద్దు

కల్హేర్, ఏప్రిల్ 8: పిల్లలు పరీక్షలు ముగించుకొని హాస్టల్, పాఠశాలల నుంచి ఇంటికి వస్తారని, వారు చెరువులు, కుంటల్లో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లకుండా వారిపై దృష్టి సారించాలని ఎస్ఐ వెంకటేశం కోరారు. సరదా కోసం ఈత వెళ్లి ఈత రాక నీట మునిగి నిండు ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలు చెరువులు, కుంటల్లోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు.

స్లోకా ది స్కూల్‌కు ప్రభుత్వ గుర్తింపు లేదు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 8: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని స్లోకా ది స్కూల్ పాఠశాలకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు లేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. సంబంధిత స్లోకా ది స్కూల్ పాఠశాలలో పిల్లలను చేర్చకూడదని కోరారు.

కానుకుంట పాఠశాలలో ఉగాది వేడుకలు

గుమ్మడిదల, ఏప్రిల్ 8: ఉగాదిని పురస్కరించుకొని కానుకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ప్రాంగణాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. ఉగాది పర్వదినం గొప్పతనాన్ని గురించి విద్యార్థులకు తెలిపారు. ఉగాది పచ్చడిని విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం వాసురెడ్డి, శ్రీనివాస్ రావు, రామరాజు, అమృత రావు, విశ్వేశ్వరశర్మ, రత్న పాల్గొన్నారు.

ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజలను పట్టించుకోని కాంగ్రెస్

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 8: అధికారంలోకి రాగానే ప్రజలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పార్టీ అసలు రూపమని బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి వెంకట్రామి ఆరోపించారు. సోమవారం సంగారెడ్డిలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు చక్రపాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే అభివృద్ధికి నిధులు తీసుకువస్తానని, అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి స్థానిక ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రధాన కారణమని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులతో మాట్లాడి ఒప్పించి అభ్యర్థిగా నిలబెట్టారన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా పేదలకు గుర్తుండిపోయే ఎన్నో సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, పక్కన అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

హామీలు అమలుచేయని రేవంత్ సర్కార్: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అమలు సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలుపై ప్రశ్నిస్తే చెప్పులతో కొడతా, మానవబాంబు అవుతా అని మాట్లాడడం సీఎం రేవంత్‌రెడ్డి అనైతిక పాలనకు నిదర్శనమనాన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమంలో ముందున్నామని, బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని 25 వేల మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, ఎర్రోళ్ల శ్రీనివాస్, నరహరిరెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, గోనెల రఘు, మనోహర్‌గౌడ్, కోడూర్ రమేశ్, పెద్దగొల్ల సత్యనారాయణ, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశం, చింతల సాయన్న, రమేశ్‌గౌడ్, ఆశం అలీ మోసిన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్, ఏప్రిల్ 8: మండలంలోని మల్లి గ్రామంలో సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడి కుటుంబ సభ్యులను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పరామర్శించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శరణప్ప కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని మృతదేహం వద్ద నివాళి అర్పించి సంతాపం తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మారుతీయాదవ్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ రాజు, నాయకులు సిధారెడ్డి, శ్రీపతి తదితరులు ఉన్నారు.

నోటుకు ఓటు అమ్ముకోవద్దు

హత్నూర, ఏప్రిల్ 8: నోటుకు ఓటు అమ్ముకోవద్దని జైభారత్ ఎస్సీ పీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్‌గల్లా కోరారు. సోమవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయాలన్నారు. భూస్వాములు, పెత్తందారులు డబ్బు ఎర చూపి ఓట్లు దండుకుంటున్నారని, గెలిచిన తర్వాత ప్రజల సమస్యలను గాలికి వదిలేస్తున్నారన్నారు. జైభారత్ ఆధ్వర్యంలో ఏండ్లుగా 20 రాష్ట్రాల్లో 8 భాషల్లో ఎన్నికల సమయంలో ప్రజలకు ఓటు విలువపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాహసం జిల్లా ప్రధాన కార్యదర్శి వరిగుంతం కృష్ణ, నాయకులు దుర్గాప్రసాద్, మహేందర్, మల్లేశం, లింగం, రాజ్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రానీయొద్దు

కోహీర్‌లో తాగునీటి సరఫరా గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ క్రాంతి

కోహీర్, ఏప్రిల్ 8: తాగునీటి ఇబ్బందులు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కోహీర్ పట్టణంతోపాటు నాగిరెడ్డిపల్లి, దిగ్వాల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెడిపోయిన బోరు మోటర్లు, పైపులకు మరమ్మతులు చేయించాలన్నారు. నాగిరెడ్డిపల్లి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు కష్టపడి చదువాలన్నారు. అక్కడినుంచి దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరాతీశారు. ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రాకుంటే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజు, తహసీల్దార్ బాలశంకర్, డీఈఈ సాబేర్ హుస్సేన్, ఏఈ సృజన్‌కుమార్, ఏవో నవీన్‌కుమార్, ఎంఈవో శంకర్, నీటి పారుదల శాఖ డీఈఈ వెంకట్రామ్‌రెడ్డి, ఏఈలు రవీందర్, శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాలి అనిల్‌కుమార్‌ను గెలిపిద్దాం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మెల్యే మాణిక్‌రావు పిలుపు

కోహీర్, ఏప్రిల్ 8: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని అతిథి హోటల్ ఆవరణలో జహీరాబాద్ మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమన్వయం చేసుకొని ప్రచారంలో ముందుకు సాగాలన్నారు. లోటుపాట్లను గుర్తించి సరి చేసుకుందామని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. బీఆర్ఎస్ కుటుంబంలా ఉంటూ గెలుపు కోసం సైనికుల్లా పని చేద్దామన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, ఎస్సీ కార్పొషన్ మాజీ చైర్మన్ నరోత్తం, పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.